# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 25-01-2026** **సమయం : 1.30 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ప్రజాస్వామ్యానికి 'ఓటరు' ఆత్మవంటివాడని ప్రధానమంత్రి నరేంద్రమోదీ మన్ కి బాత్‌లో పేర్కొన్నారు.**

2. **ప్రజల ఐకమత్యం, కర్తవ్య భావంతో అసాధ్యమనే సమస్యలకు పరిష్కారం సాధ్యమవుతుందని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అన్నారు.**

3. **18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. విజయానంద్ సూచించారు.**

4. **న్యూజిలాండ్ క్రికెట్ జట్టు భారత పర్యటనలో భాగంగా ఇరు జట్ల మధ్య టి 20 సిరీస్‌లో భాగంగా మూడవ మ్యాచ్ రాత్రి 7 గంటలకు గౌహతిలో జరుగుతుంది.**

==========================

ఓటరు ప్రజాస్వామ్యానికి ఆత్మవంటివాడని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. ఆకాశవాణి ద్వారా మనసులోని భావాలను పంచుకునే మన్ కి బాత్, మనసులోని మాట 130వ సంచిక కార్యక్రమంలో పలు అంశాలపై ప్రధానమంత్రి ఈరోజు ప్రసంగించారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఆయన పలు విషయాలను పంచుకున్నారు. 18 సంవత్సరాలు నిండిన తర్వాత ఓటరుగా మారడాన్ని చాలా మంది సాధారణ విషయంగా భావిస్తారని, కానీ నిజానికి అది ప్రతి భారతీయుడి జీవితంలో అత్యంత ముఖ్యమైన మైలురాయిగా మారుతోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలియజేస్తూ..

వాయిస్..30.. సెకన్లు

--------------------------

ప్రజల ఐకమత్యం, కర్తవ్య భావంతో అసాధ్యమనే సమస్యలకు పరిష్కారం సాధ్యమవుతుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఈరోజు జరిగిన మన్ కి బాత్ కార్యక్రమంలో రాష్ట్రంలోని అనంతపురం జిల్లా గురించి ఆయన ప్రస్తావించారు. దీర్ఘకాలంగా కరువు సమస్యతో పోరాడుతున్న అనంతపురం జిల్లా, ఎర్రమట్టి--ఇసుక మిశ్రమ భూమి కారణంగా నీటి కొరతను ఎదుర్కొంటోందని ప్రధాని గుర్తు చేశారు. ఈ సమస్యకు పరిష్కారంగా అక్కడి ప్రజలు ప్రభుత్వ సహకారంతో జలాశయాల శుభ్రపరిచే కార్యక్రమాన్ని చేపట్టారని ప్రధానమంత్రి

నరేంద్ర మోదీ పేర్కొంటూ..

వాయిస్..27 సెకన్లు

---------------------------

దేశవ్యాప్తంగా పర్యావరణ సంరక్షణపై ప్రజల్లో అవగాహన పెరుగుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఈ నేపథ్యంలో ప్రారంభించిన 'ఏక్ పేడ్ మా కే నామ్' (అమ్మ పేరుతో ఒక చెట్టు) ఉద్యమానికి దేశవ్యాప్తంగా విశేష స్పందన లభిస్తోందని ఈరోజు జరిగిన మన్ కీ బాత్ కార్యక్రమంలో తెలిపారు. ఈ ఉద్యమం ద్వారా నేడు కోట్లాది మంది ప్రజలు పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములయ్యారని పేర్కొన్నారు. ఇప్పటివరకు దేశంలో రెండు వందల కోట్లకు పైగా చెట్లు నాటడం సాధ్యమైందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ వివరిస్తూ...

వాయిస్. 30 సెకన్లు

---------------------------

యువత ఆలోచనలు, ఆవిష్కరణలు దేశ భవిష్యత్తును నిర్దేశిస్తున్నాయని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. 2016లో ప్రారంభమైన స్టార్టప్ ఇండియా కార్యక్రమం నేటికి పదేళ్ల ప్రయాణాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా మన్ కీ బాత్ కార్యక్రమంలో ఈరోజు ఆయన మాట్లాడారు. భారతదేశాన్ని ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ ఎకోసిస్టమ్‌గా నిలబెట్టిన ఘనత యువతదేనని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలుపుతూ..

వాయిస్.. 30 సెకన్లు

---------------------------

అనంతపురం జిల్లాలో కరువు పరిస్థితుల మధ్య కూడా అక్కడి ప్రజలు, రైతులు నీటి సంరక్షణలో వినూత్న ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ ప్రయత్నాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మన్ కీ బాత్ కార్యక్రమంలోనూ ప్రస్తావించారు.ప్రజల సహకారంతో 'అనంత నీరు సంరక్షణ' కార్యక్రమాన్ని మొదలుపెట్టారు. ఇంకుడు గుంతల ద్వారా నీటి నిల్వ పెరిగి బోర్లు రీఛార్జ్ అయ్యాయని జిల్లాకు చెందిన రైతు మోహిని మాట్లాడుతూ...

వాయిస్...25 సెకన్లు

---------------------------

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2015లో ప్రారంభించిన ప్రో-యాక్టివ్ గవర్నెన్స్ అండ్ టైమ్లీ ఇంప్లిమెంటేషన్ (ప్రగతి) వేదిక 50వ సమావేశాన్ని విజయవంతంగా నిర్వహించింది. కీలకమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, ప్రజా ఫిర్యాదులను నేరుగా ప్రధానమంత్రి స్థాయిలో సమీక్షించి పరిష్కరించే ఈ డిజిటల్ వేదిక పాలనలో గణనీయమైన మార్పు తీసుకొచ్చింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర మంత్రిత్వ శాఖలు ఒకే వేదికపై కలిసి పనిచేసే సహకార వ్యవస్థకు ప్రగతి ప్రతీకగా నిలిచింది. హిమాచల్ ప్రదేశ్‌లోని ఎన్‌హెచ్-22పై ఉన్న 39 కిలోమీటర్ల పర్వానూ-సోలన్ రహదారి నాలుగు లైన్ల ప్రాజెక్టు ప్రగతి విజయానికి ఉదాహరణగా నిలిచింది. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ-ఎన్‌హెచ్ఎఐ అమలు చేసిన ఈ ప్రాజెక్టుకు సుమారు ఒక వెయ్యి 635 కోట్ల రూపాయలు ఖర్చు అయింది. భూసేకరణ, అటవీ అనుమతులు, పరిహార చెల్లింపుల కారణంగా ప్రాజెక్టు ఆలస్యమైంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉన్నత స్థాయి సమీక్షలతో శాఖల మధ్య సమన్వయంతో సమస్యలు

పరిష్కారమయ్యాయి. ఫలితంగా ఈ ప్రాజెక్టు 100 శాతం పూర్తై 2023 డిసెంబర్ 20న ప్రజలకు అందుబాటులోకి వచ్చింది.

--------------------------

18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. విజయానంద్ అన్నారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేతంలో 16వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని మై ఇండియా, మై ఓట్ ఇతివృత్తంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు కీలకమైందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. విజయానంద్ తెలియజేస్తూ..

వాయిస్...20 సెకన్లు

--------------------------

న్యూజిలాండ్ క్రికెట్ జట్టు భారత పర్యటనలో భాగంగా ఇరు జట్ల మధ్య నిర్వహిస్తున్న టి 20 సిరీస్ లో మూడవ మ్యాచ్ ఈరోజు జరుగనుంది. గౌహతిలోని డాక్టర్ భూపేన్ హజారికా క్రికెట్ స్టేడియంలో రాత్రి 7 గంటలకు మ్యాచ్ ప్రారంభమవుతుంది. ఐదు మ్యాచ్ ల సిరీస్ లో భాగంగా నిర్వహించిన రెండు మ్యాచ్‌లలో భారత్ విజయం సాధించి 2-0 ఆధిక్యంతో నిలిచింది.

--------------------------

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం లాంటిదని, అర్హులైన ప్రతీ ఒక్కరు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్రంలోని వివిధ జిల్లాల కలెక్టర్లు పేర్కొన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పిస్తూ.. ర్యాలీలను ఈరోజు నిర్వహించారు.

=====================